## క్లుప్తంగా

### ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న నరసింహస్వామి

రొళ్ల: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్‌బీఐ విశ్రాంత రీజినల్ డైరెక్టర్ ఎస్.ఎం.నరసింహస్వామి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ అండ్ సీఈఓ ఎంవీ రావు సహకారంతో రూ.2 లక్షలు విలువ చేసే ఆర్‌ఓ ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్‌ను రొళ్ల మండలం దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను శుక్రవారం మధ్యాహ్నం నరసింహస్వామి ప్రారంభించారు.

### కొండ ప్రాంతంలో మంటలు



ఎగిసిపడుతున్న మంటలు

పెనుకొండ: పెనుకొండ సమీపంలోని షీఫారం కొండ ప్రాంతంలో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట ప్రాంతంలో బోదకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు వ్యాపించాయి. త్రిపురా రిసార్ట్, గొర్రెల పెంపక క్షేత్రం షెడ్ల వరకూ మంటల తీవ్రత వ్యాపించింది. గొర్రెల కాపరులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

### కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

గుడిబండ: నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు కర్ణాటక సరిహద్దులో చేపట్టిన తనిఖీల్లో పెద్ద మొత్తంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. అతని వద్ద నుంచి 115 టెట్రా ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందుతుడిని న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

### ఆటో ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు జగదీష్

అమరాపురం: ఆటో ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... అమరాపురం మండలం వి.అగ్రహారం గ్రామానికి చెందిన జగదీష్ (50), తన కుమారుడు మంజునాథ్‌తో కలసి శుక్రవారం ఉదయం హేమావతి సిద్దేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవాన్ని చూసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉదుగూరు సమీపంలో హేమావతి వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌ను శిర ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



హిందూపురం: నమూనాలు పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్త ప్రకాష్ శిగ్గావి

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సౌజన్యంతో విద్యార్థులచే రూపొందించిన విజ్ఞాన శాస్త్ర నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హిందూపురం మండలం కిరికెర పంచాయతీలోని ఎల్‌ఆర్‌జీ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో బెంగళూరు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకాష్ శిగ్గావి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

### రైలు కింద పడి వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతను ఆత్మహత్య చేసుకున్నాడా లేకపోతే ప్రమాదవశాత్తూ చనిపోయాడా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# టమాట ధర ధమాల్



- కిలో రూ.5 లోపే అమ్మకం
- బోరుమంటున్న రైతులు
- రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

గుడిబండ: ఏ కూర వండాలన్నా.. టమాట తప్పనిసరి. అంతటి ప్రాధాన్యత ఉన్న టమాట పండించే రైతులు మాత్రం కన్నీరు పెడుతున్నారు. మూడు మాసాల క్రితం వరకూ తారెత్తించిన టమాట ధరలు నెల రోజులులగా నేల చూపు చూస్తోంది. రోజు రోజుకి ధర పతనమవుతుండటంతో రైతులు బోరుమంటున్నారు. తాజాగా కిలో రూ.5 లోపే ఉండటంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు.

**15 కిలోల బాక్స్ రూ. 80**

మూడునెలల క్రితం వరకూ కిలో టమాట కిలో ధర రూ. 30 నుంచి రూ.40 వరకూ పలికింది. అయితే ప్రస్తుతం 15 కిలోల బాక్స్ రూ.60 నుంచి రూ.80 మాత్రమే పలుకుతున్నాయి. ఈ లెక్కన కిలో రూ.5 లోపు పలుతోంది. రిటైల్ వ్యాపారులు మాత్రం రూ.10 నుంచి రూ.15 వరకూ అమ్మకాలు జరుపుతున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో కూడా ధర పలకడం లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించినా ధర లేకపోవడంతో రైతులు బజారుకు తెచ్చి అమ్మే పరిస్థితి కూడా లేకపోయింది.

**నియోజకవర్గంలో 373 ఎకరాల్లో సాగు..**

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 373 ఎకరాల్లో టమాట పంటను అన్నదాతలు సాగు చేశారు. ఎకర సాగు చేయడానికి దాదాపు రూ. 80 నుంచి రూ.90 వేల వరకూ పెట్టుబడులు వస్తాయి. అయితే ప్రస్తుతం ధర ప్రకారం సాగుకు చేసిన పెట్టుబడి కూడా తిరిగి దక్కే పరిస్థితులు లేవని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడిబండ మండలంలో జంబులబండ, నాగేపల్లి, మండలపల్లి, తాళికెర, మద్దనకుంట, ఎస్‌ఆర్ హట్టి తదితర గ్రామాల్లో రైతులు టమాట పంటను అధికంగా పండిస్తున్నారు. అక్కడి నుంచి ఆటోల్లో గుడిబండ, మడకశిర, అమరాపురం మార్కెట్‌కు తీసుకు వచ్చి అమ్ముతుంటారు. అయితే ప్రస్తుత ధరతో పంట తరలింపునకు అయ్యే ఖర్చు కూడా రావడం లేదంటున్నారు.

**పట్టించుకోని కూటమి ప్రభుత్వం**

కొద్ది రోజులుగా టమాట ధర భారీగా పతనమవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించక, బీమా ప్రీమియం కూడా చెల్లించకపోవడంతో అన్ని విధాలా ఇబ్బందులు పడుతున్నామంటున్నారు.



ఫళారం గ్రామంలో సాగులో ఉన్న టమాట పంట

**నియోజకవర్గంలో టమాట సాగు ఇలా..**

| మండలం | సాగు (ఎకరాల్లో..) |
|---|---|
| మడకశిర | 120 |
| అమరాపురం | 90 |
| గుడిబండ | 73 |
| అగళి | 40 |
| రొళ్ల | 50 |

ఇప్పటికైనా టమాట పంటకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



### పెట్టుబడి కూడా దక్కలేదు

ఎకరా పంట పొలంలో అప్పు చేసి రూ.90 వేలు పెట్టుబడి పెట్టి టమాట పంటను సాగు చేశాను. పంట తీసి మార్కెట్‌కు తీసుకెళ్తే ఏ ఒక్కరూ కొనడంలేదు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో నష్టం వచ్చింది. మార్కెటింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

– ఉమేష్ రైతు, ఫళారం, గుడిబండ మండలం



### కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

రైతుల శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. గ్రామాల నుంచి తీసుకొచ్చిన పంటకు ధర లేక నష్టపోతున్నాం. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసి పంటలకు మద్దతు కల్పించినప్పుడే రైతులు బాగుపడతారు. లేకపోతే దళారుల రాజ్యమే నడుస్తుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– ఈరన్న రైతు, ఎస్‌ఆర్ హట్టి, గుడిబండ మండలం.

### పోసాని అరెస్టు అప్రజాస్వామికం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: న్యాయవ్యవస్థ సిగ్గుపడే విధంగా కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణ మురళి అరెస్టు అప్రజాస్వామికమన్నారు. ఆయన అరెస్టును ఖండిస్తున్నామన్నారు. బీఎన్ఎస్ 111 సెక్షన్లు వర్తించవని న్యాయవ్యవస్థ పేర్కొన్నప్పటికీ పట్టించుకోకుండా అవే సెక్షన్లతో అమానుషంగా అక్రమ కేసులు నమోదు చేయడం హేయమన్నారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అక్రమ నిర్బంధాలు, అక్రమ సెక్షన్లకు దిగడంతో పాటు ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి బలి కావద్దని పోలీసులకు హితవు పలికారు.

**సిద్దేశ్వరుడి సేవలో ఈరలక్కప్ప**

అమరాపురం: హేమావతిలో జరుగుతున్న సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, ఎంపీపీ ఈరన్న స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకంగా ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండంలోకి దూపం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహరాజు, మంజునాథ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, సర్పంచు తిప్పేస్వామి, తదితరులున్నారు.

### పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

మడకశిర: ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ పరీక్ష సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని, పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు.

# ఇది ప్రజలను మోసగించే బడ్జెట్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప



టీఎన్.దీపికా



ఈరలక్కప్ప

మడకశిర: కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలను మోసగించే విధంగా ఉందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్ పేదలకు కూడా పూర్తిగా వ్యతిరేకంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి పేదలను మోసం చేశారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఆడబిడ్డ నిధి ఊసేలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో కేవలం వైఎస్ జగన్‌ను విమర్శించేందుకు, చంద్రబాబు, లోకేశ్‌ను పొగడడానికే సరిపోయిందన్నారు.

చిలమత్తూరు: అసెంబ్లీలో శుక్రవారం మంత్రి పయ్యావుల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపికా విమర్శించారు. సీఎం చంద్రబాబు బావమరిది ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయకపోవడం సరికాదన్నారు. చిలమత్తూరు మండలంలో హంద్రీనీవా ద్వారా చెరువులన్నీ నింపుతామని 2014లోనే హామీ ఇచ్చారని, మూడోసారి నమ్మి గెలిపించిన ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తెప్పిస్తామని అబద్ధపు ప్రచారాలు చేశారని, చంద్రబాబు లాగా బాలకృష్ణ కూడా నియోజకవర్గ ప్రజలకు మోసగించారన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు భూములు ఉన్నా వాటి ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు.

**సంక్షేమానికి కోత పెట్టే బడ్జెట్**

మడకశిర: ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంక్షేమానికి కోత పెట్టే విధంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలకు ఈబడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కలేదన్నారు. కొన్ని పథకాలను మాత్రమే ప్రస్తావించారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడానికి సాధ్యం కాదనే నిజాన్ని బయటపెట్టారన్నారు.

# ఆవిష్కరణలతో సమస్యల పరిష్కారం

పుట్టపర్తి: కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ క్రిష్టప్ప అధ్యక్షత వహించారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్, ఏడీ లాజర్, ఎంఈఓలు జయచంద్ర, జాన్, హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. డీఈఓ మాట్లాడుతూ స్థానిక సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి దోహదపడే ఆవిష్కరణలు చేయాలని సూచించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.



విజేతలతో డీఈఓ క్రిష్టప్ప, పాఠశాలల సిబ్బంది



కాల భైరవేశ్వరునికి అరటి పండ్లు రాస్తున్న భక్తులు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన జనం

### హేమావతికి పోటెత్తిన భక్తులు

అమరాపురం: సిద్దేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవం, స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఎన్నడూలేని విధంగా దాదాపు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ.రాజకుమార్, ఎస్ఐ. ఇషాక్‌బాషా ఆధ్వర్యంలో మడకశిర సర్కిల్‌లోని పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ముత్యాల పల్లకీపై శివపార్వతులు



లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాల్లో మండల కేంద్రమైన లేపాక్షిలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో శివపార్వతులను ముత్యాల పల్లకీలో ఊరేగించారు. మెయిన్ బజార్, రాజవీధి, హిందూపురం – కొడికొండ చెక్‌పోస్ట్ రహదారి మీదుగా ఊరేగింపు సాగింది. అంతకు ముందు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**మున్సిపల్ వేలం పాట మళ్లీ వాయిదా**

మడకశిర: పట్టణంలోని కూరగాయల మార్కెట్, వారపు సంత, బస్టాండ్ పార్కింగ్ స్థలాల సుంకం వసూలుకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆధ్వర్యంలో ఈవేలం పాటను జరిగింది. అయితే ఈ వేలం పాటలో ఎవరూ పాల్గొనలేదు. దీంతో వేలం పాటను మున్సిపల్ అధికారులు మళ్లీ వాయిదా వేశారు. మార్చి 6న ఉదయం 11 గంటలకు మళ్లీ వేలం పాటను నిర్వహించనున్నట్లు కమిషనర్ రంగస్వామి తెలిపారు.

**పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం**

మడకశిర: నియోజకవర్గంలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల వ్యవస్థ పని చేస్తుందన్నారు. వలంటీర్లుగా ఎంపికైన వారు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారు మడకశిరలోని మండల న్యాయ సేవాధికార సంస్థ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

**రీసర్వే సద్వినియోగం చేసుకోండి**

లేపాక్షి: మండలంలోని మానేపల్లిలో చేపట్టిన భూ రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వే చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, వచ్చే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**వైద్యాధికారి బదిలీ**

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారి హరికుమార్ వైఎస్సార్ జిల్లా పీజీకి బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం ఆస్పత్రి సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. నాలుగేళ్లుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, అశ్వినికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**విద్యుత్ స్తంభాలు తొలగించండి**

పరిగి: మండల కేంద్రంలోని పాత ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని అంబేడ్కర్ భవన నిర్మాణ వేదిక సభ్యులు కోరారు. అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం ఇటీవల పాత ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో అధికారులు స్థలం కేటాయించారు. అయితే అక్కడ గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు సత్వరమే అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్పకు వినతిపత్రాన్ని అందజేశారు.

**13 మంది కోడిపందెంరాయుళ్ల అరెస్ట్**

రొళ్ల: మండల పరిధిలోని దాసప్పపాళ్యం సమీపంలోని కొండ ప్రాంతంలో కోడిపందాలు ఆడుతున్న 13 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వీరాంజినేయులు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లతో పాటు రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను త్వరలోనే కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

**నాగరత్నమ్మకు సన్మానం**

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నాగరత్నమ్మ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు... నాగరత్నమ్మ సేవలను కొనియాడారు. అనంతరం నాగరత్నమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎంఈఓలు కుళ్లాయప్ప, ప్రసన్నలక్ష్మి, లక్ష్మీదేవి, శేషాచలం, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

**నెదర్లాండ్ బృందం పర్యటన**

మడకశిరరూరల్: నెదర్లాండ్, ఫ్రీఫేర్డ్ బై నేచర్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం మండలంలోని కోతులగుట్ట, జక్కేపల్లి, హరేసముద్రం గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన మామిడి తోటలను పరిశీలించారు. పండ్లతోటల పెంపకం ద్వారా కలిగే లాభాలు, ఉపయోగాలను రైతులకు అవగాహన కల్పించారు.

**మురుగునీటి కాలువల పరిశీలన**

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని 20వ వార్డు బోయపేటలోని మురుగు నీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. స్థానికంగా నివాసం ఉంటున్న వారి ఫిర్యాదుల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఫోన్ ద్వారా మురుగు నీటి కాలువలను వెంటనే పరిశుభ్రం చేయించాలని కోరారు. నాయకులు శంకరయ్య, హనుమంతప్ప, శ్రీనివాసులు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు**

పెనుకొండ: ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పెనుకొండలో రెండు పరీక్ష కేంద్రాల్లో 418 మంది ఫస్ట్ ఇయర్ ఇంటర్ విద్యార్థులు, 326 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

మడకశిర: నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షలు 7 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 4,186 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

**ఘనంగా జ్యోతుల ఉత్సవం**

అగళి: మండల పరిధిలోని కారిదాసన్నపల్లిలో వెలసిన మారెమ్మదేవికి జ్యోతుల మహోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

### ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

హిందూపురం టౌన్: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్‌ఫండ్ ద్వారా సీఈఓ ఎంవీ రావు రూ.2 లక్షల విలువజేసే 1000 లీటర్ల ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులానికి అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, గురుకులం ప్రిన్సిపాల్ నాగమణి ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతాప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: కాటికాపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఇందిరాపార్కులో జిల్లా కాటికాపరుల సంఘం సదస్సును నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కాటికాపర్ల సమస్యల పరిష్కారానికి 11న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

**నూతన కమిటీ ఎంపిక**

కాటికాపర్ల సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గాపాలప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమంతరాయుడు, ఉపాధ్యక్షుడిగా కదిరప్ప, సహాయ కార్యదర్శిగా తిమ్మయ్యలతో పాటు 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన మధులత (20) గత ఏడాది డిసెంబర్ 5న అదృశ్యమైనట్లు యువతి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు చేశారని కియా ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదని పేర్కొన్నారన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### 15లోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

హిందూపురం: హిందూపురం పరిధిలో డేటా వెరిఫికేషన్‌లో భాగంగా మార్చి 15వ తేదీలోపు అన్ని ఈకేవైసీ, లెఫ్ట్ ఓవర్ రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. చౌకధాన్యపు డిపోలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మార్చి 15లోపు ఈ-కేవైసీ పూర్తి చేయని యూనిట్లు తొలగిస్తామన్నారు.